క్లుప్తంగా

భూ వివాదంలో ఇద్దరిపై కేసు నమోదు

రేణిగుంట: గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న భూ వివాదంలో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, మండలంలోని చెంగారెడ్డి పట్టెడ గ్రామానికి చెందిన కాంతారెడ్డి, అల్లికేశం గ్రామానికి చెందిన మురళి భూమి విషయమై ఆదివారం ఘర్షణ పడారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు గాజుల మండ్యం పోలీసులు కేసులు నమోదు చేసి విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం


విద్యార్థులతో సంఘం నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని కొత్తపేటలో ఉన్న శ్రీ విజయలక్ష్మి డిగ్రీ కళాశాలలో ఆదివారం కరుణీక సంఘం ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు జ్ఞాపికతోపాటు నగదు ప్రోత్సాహం అందజేశారు. దీనికి ముఖ్య అతిథులుగా కె.ఏ.మునిసురేష్ పిళ్లై, కె.విశ్వనాథపిళ్లై, పి.చంద్రశేఖర్ హాజరయ్యారు. విద్యార్థులను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని కార్యవర్గ సభ్యులు తెలిపారు. పి.ఎస్.ప్రకాష్, కె.ఉమాశంకర్, కె. దామోధరం, యు.రజినీకాంత్, కె.శ్యామ్‌రాజ, చరణ్, యు.వసంత్ కుమార్, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ పెద్దలు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో ఈ నెల 30వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీకృష్ణ శ్రీద్రౌపదీదేవి సమేత ధర్మరాజ స్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆలయ పెద్దలు ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఏటా ఎంతో వైభవంగా జరగనున్న ఈ ఉత్సవాలను ఈ ఏడాది కూడా మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, మాజీ జెడ్పీటీసీ సభ్యులు మునిరంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొంగర కృష్ణారెడ్డి, ఉత్సవ కమిటీ పెద్దలు మనోహర్‌రెడ్డి, బలరాంరెడ్డి, భూలక్ష్మీ, గంగమ్మ, మునెమ్మ పాల్గొన్నారు.


ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆటో డ్రైవర్లకు ఒకటో పట్టణ సీఐ గోపి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఆటో నడిపే వ్యక్తులందరూ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని తెలిపారు. పేరు, చిరునామాలు పోలీసులకు ఇవ్వాలని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి దేవస్థానానికి వచ్చే భక్తుల పట్ల అమర్యాదగా ప్రవర్తించరాదని తెలిపారు. రైలు వచ్చినప్పుడు ప్లాట్‌ఫామ్ మీదకు వెళ్లి ప్రయాణికులను బలవంతంగా ఆటోల్లో ఎక్కించుకుని లాడ్జీల వద్దకు తీసుకెళ్లి కమీషన్ల కోసం వారిని బెదిరించడం చేయకూడదన్నారు. అలా చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

తేనె తుట్టె.. తొలగిస్తే ఒట్టు!

తిరుపతి అర్బన్: జిల్లా కేంద్రమైన తిరుపతిలోని కలెక్టరేట్ కార్యాలయానికి సోమవారం వస్తే చాలు తేనెటీగల టెన్షన్ తప్పడం లేదు. 40 రోజులుగా కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రధాన ద్వారం వద్ద స్లాబ్‌కు పెద్ద తేనెటీగల తుట్టె ఉంది. ఏమాత్రం కదిలించినా.. అంతే సంగతులు.. పెద్దతేనెటీగలు దాడి చేస్తే ఏంటి పరిస్థితి అని కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరి మెదిలో భయం? ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా పలు సమస్యలపై జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వెయ్యి మందికి పైగా అర్జీదారులు వస్తుంటారు. వారిలో దివ్యాంగులు, వృద్ధులు, పిల్లలు ఉంటారు. ఒకవేళ తేనెటీగల పుట్టలో కదలిక వస్తే వీరి పరిస్థితి ఏంటని ఆలోచిస్తేనే భయం కలుగుతోంది. కార్యాలయానికి వచ్చే ఉద్యోగులకు సైతం ఆందోళన తప్పలేదు. అయితే అధికారులు తేనెటీగల తుట్టెను రోజూ చూసి వెళ్తూ లైట్ తీసుకుంటున్నారు. కలెక్టరేట్‌కు సోమవారంతో పాటు ప్రతి రోజూ వచ్చే అర్జీదారులే కాకుండా కార్యాలయానికి వచ్చే ఉద్యోగుల్లోనూ ఇదే టెన్షన్. అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని తేనే తుట్టెను తొలగించాలని పలువురు కోరుతున్నారు.


కలెక్టరేట్‌లోని ప్రధాన ద్వారం వద్ద పైభాగంలో స్లాబ్‌కు ఉన్న తేనెతుట్టె



దుస్థితిలో ఆలత్తూరు రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ: సంక్రాంతిలోపు రహదారులను మెరిసేలా చేస్తామని, గుంతలు లేకుండా పూడ్చుతామని కూటమి ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో కనిపించడం లేదు. ఆలత్తూరు రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. రహదారిలో దారిని వెతుక్కొని వాహనదారులు వెళ్లాల్సి వస్తోంది. మండలంలోని ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, కత్తివారికండ్రిగ, రెడ్డిగుంటబాడవ, పట్టాభి గిరిజన కాలనీ, గ్రామాలకు కేటీరోడ్డు నుండి వెళ్లే రోడ్డు గుంతలమయమై అధ్వాన్నంగా ఉంది. దీంతో గ్రామస్తులు, తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు వెంబడి రాళ్ల క్రషర్లు, క్వారీలు ఉన్నాయి. క్రషర్లు, క్వారీల నుండి లారీలలో 50 టన్నులకు పైగా బరువున్న రాళ్ల మెటల్‌ను తీసుకుపోతున్నారు. దీంతో రోడ్డు దెబ్బతిందని గ్రామస్తులు అంటున్నారు. ఈ రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడ్డంతో అధ్వాన్నంగా తయారైంది. వర్షం పడితే గుంతల్లోకి నీరు చేరి రొచ్చురొచ్చుగా తయారవుతోంది. చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. రోడ్డుపై గ్రామస్తులు నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు నడపడం కష్టమవుతోంది.

వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. వాహనదారుల బాధలు వర్ణనాతీతం. రోడ్డుపై గుంతల వలన ఆర్‌టీసీ బస్సుల కట్టలు దెబ్బతింటున్నాయని, బస్సులను తిప్పడం మానేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఓవర్‌లోడు మెటల్ లారీలు రోడ్డుపై తిరగకుండా అరికట్టాల్సిన మైనింగ్ అధికారులు మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఈ రహదారిపై రోజుకు 200 వందలకు పైగా వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అధికారులు స్పందించి రహదారిపై గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని వాహదారులు కోరుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపై మురుగుతో ఇక్కట్లు

కేవీబీపురం: మండల కేంద్రంలోని సంత మైదానం వద్ద ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డుపై మురుగునీరు నిల్వ చేరడంతో అటుగా వెళ్తున్న స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన వెదజల్లడంతో పాటు మురుగునీటిపైనే పాదచారులు వెళ్లాల్సి వస్తోంది. అంతేకాక సంత జరిగే సమయంలో ఎక్కువ సంఖ్యలో ప్రజలు అటువైపు రావాల్సి ఉండడంతో మురుగునీటి నిల్వల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కేవీబీపురం సంత వద్ద మురుగునీటి నిల్వ


అధ్వాన్నంగా ఉన్న ఆలత్తూరు రోడ్డు

మృతుని కుటుంబానికి పరామర్శ


కందాటి వెంకట రాఘవరెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: మండలంలోని అమ్మపాళానికి చెందిన ముక్కంటి ఆలయ మాజీ పాలకమండలి సభ్యుడు, మాజీ సర్పంచ్ కందాటి వెంకటరాఘవరెడ్డి అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అక్కడికి చేరుకుని వెంకట రాఘవరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడీ పంచాయతీ దొడ్లమిట్ట, బీసీ కాలనీ, ఇందిరా నగర్‌లో ఆదివారం తిరుపతి రూరల్ ఎక్సైజ్ సీఐ నరసనాయుడు మత్తు పదార్థాల వినియోగంపై యువతకు అవగాహన కల్పించారు. చిన్న వయసులోనే మత్తు పదార్థాలకు బానిసైతే జరిగే పరిణామాలపై యువకులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం మండలంలోని మద్యం షాపు యజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ అంజు ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మ జాతర


అంబలి కుండలకు పూజలు

నారాయణవనం: మండలంలోని పాలమంగళం ఉత్తరపుకండ్రిగలో రౌద్రాలి అంకమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అంబలి కుండలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో అంబలి కుండలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహా నైవేద్యాన్ని సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అంబలి పంచిపెట్టారు. సాయంత్రం సమీపంలోని అరుణానదిలో పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం సాయంత్రం భక్తుల అగ్నిగుండ ప్రవేశం, రాత్రి అమ్మవారి గ్రామ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ పేర్కొంది.

రోడ్డుపైనే మురుగు

కేవీబీపురం: మండల కేంద్రంలోని సంత మైదానం వద్ద ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డుపై మురుగునీరు నిల్వ చేరడంతో అటుగా వెళ్తున్న స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన వెదజల్లుతున్నప్పటికీ మురుగునీటిపైనే పాదచారులు వెళ్లాల్సి వస్తోంది. అంతేకాక సంత జరిగే సమయంలో ఎక్కువ సంఖ్యలో ప్రజలు అటువైపు రావాల్సి ఉండడంతో మురుగునీటి నిల్వల కారణంగా ఇబ్బంది పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కేవీబీపురం సంత వద్ద మురుగునీటి నిల్వ

వైభవంగా ముత్యాలమ్మ తల్లి జాతర

ఏర్పేడు: మండలంలోని చెల్లూరు గ్రామంలో వెలసిన గ్రామ దేవత సంతాన సంపద ముత్యాలమ్మ తల్లి జాతర ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి అభిషేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. గ్రామంలోని మహిళలు సామూహిక పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి చెల్లూరులోని ఆలయానికి చేరుకున్నారు. ఆమె అమ్మవారికి సారె సమర్పించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన ప్రకాష్ యాదవ్, శ్రీను యాదవ్, కమలాకర్ రెడ్డి, కేశవులు రెడ్డి, గురునాధం, ఎల్లయ్య, వర్మ, మధు, ఉమా, దేవా, పవన్, దినేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

మృతదేహాలు బంధువులకు అప్పగింత

శ్రీకాళహస్తి: పట్టణంలోని కైలాసగిరి కాలనీలో నివాసం ఉంటూ ఆత్మహత్య చేసుకుని శనివారం మృతి చెందిన పద్మ, సురేష్ మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు ఆదివారం అప్పగించారు. పట్టణంలోని కైలాసగిరి కాలనీలోని ఓ ఇంట్లో కుటుంబ గొడవలతో ఆత్మహత్య చేసుకున్న వైజాగ్‌కు చెందిన పద్మ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అదే విధంగా సురేష్ మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ భార్యాభర్తల మధ్య జరిగిన వివాదం కారణంగా ఈ ఆత్మహత్యలు జరిగాయని, ఇందులో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. వారి కుటుంబ సభ్యులను విచారించినట్లు తెలిపారు.

మురికి కూపంలో చెన్నవారిపాళెం దళితవాడ

- దోమల వృద్ధి, అనారోగ్యంతో అవస్థలు
- పట్టించుకోని పంచాయతీ పాలకులు


చెన్నవారిపాళెం దళితవాడ మరో వీధిలో నిల్వ ఉన్న మురుగునీరు

వరదయ్యపాళెం: మండలంలోని వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ చెన్నవారిపాళెం దళితవాడలో మురుగునీటి కాలువలు లేక రోడ్ల వెంబడి మురుగునీటి నిల్వలతో స్థానికులు సతమతమవుతున్నారు. పేరుకు మేజర్ పంచాయతీ పరిధిలో దళితవాడ ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం శూన్యం. దళితవాడలో మురుగునీటి కాలువలు లేని కారణంగా ఇళ్ల ముంగిటే మురుగునీటి నిల్వలు చేరుతున్నాయి. ఆ మురుగునీటి దుర్వాసన ఓ వైపు, మరో వైపు దోమల వృద్ధితో రాత్రివేళ కంటి మీద కునుకు లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అంతే కాకుండా దోమల తాకిడికి స్థానికులు సైతం తరచూ అనారోగ్యం పాలవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కనీసం మురుగును శుభ్రం చేసే పరిస్థితి కూడా లేనట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేజర్ పంచాయతీకి ఆదాయ వనరులు ఉన్నప్పటికీ అభివృద్ధి చేపట్టడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు స్పందించి మురుగునీటి కాలువల నిర్మాణంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



చెన్నవారిపాళెం దళితవాడలో ప్రధాన రోడ్డుకు ఆనుకుని మురుగునీటి నిల్వలు, పడమటి వీధిలో ఆగి ఉన్న మురుగునీరు

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లిలో ఆదివారం రెడ్‌క్రాస్ సొసైటీ, శ్రీకాళహస్తి ఎంజీఎం ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ శిబిరాన్ని ప్రారంభించారు. రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆరోగ్య నియమాలను పాటించి సంపూర్ణ ఆరోగ్యం పొందాలని సూచించారు. ఎంజీఎం ఆస్పత్రిలో ఎన్‌టీఆర్ వైద్యసేవ, ఈహెచ్ఎస్, వివిధ ఆరోగ్య బీమా సేవలు అందుబాటులో ఉన్నాయని, చుట్టుపక్కల ప్రజలు ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వివేక్ చైతన్య, డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్దపాండూరు-వరదయ్యపాళెం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు మార్గంలో పాండూరు చెరువు వద్ద కలుజునీరు వెళ్లే వంతెన వద్ద పిట్టగోడ నిర్మించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. పెద్దపాండూరు చెరువు నుంచి పొలాలకు సాగునీరు వెళ్లేందుకు ఆర్అండ్‌బీ రోడ్డు మార్గంలో గతంలో పైపు కల్వర్టును నిర్మించారు. అయితే కల్వర్టుకు ఇరువైపులా పిట్టగోడ నిర్మించకపోవడంతో ఆ మార్గంలో ద్విచక్ర వాహనాలు, పెద్ద వాహనాలు తరచూ ప్రమాదాల పాలవుతున్నాయి. రాత్రివేళల్లో వాహనదారులు కల్వర్టు వద్ద కాలువను గమనించక నేరుగా దూసుకెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదే కల్వర్టువద్ద ఇటీవల కొయ్యల లోడుతో వస్తున్న ట్రాక్టర్ ప్రమాదానికి గురై డ్రైవర్ మరణించాడు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పిట్టగోడను నిర్మించాలని కోరుతున్నారు.


పెద్ద పాండూరు మార్గంలో పిట్టగోడ లేని కల్వర్టు

విస్తారంగా సజ్జ సాగు

- సూచనలు పాటిస్తే మంచి దిగుబడి


కాదిరివేడు పొలాల్లో సాగు చేస్తున్న సజ్జ పంట

సత్యవేడు: తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే త్రుణ ధాన్యాల సాగుపై రైతులు దృష్టి పెడుతున్నారు. పెట్టుబడుల మోత, పంట చేతికొచ్చే సమయంలో అతివృష్టి, అనావృష్టి కారణాలతో నష్టాలు చూస్తున్న రైతులు తక్కువ పెట్టుబడితో ఆదాయం వచ్చే పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. గతంలో వేరుశనగలో అంతర పంటగా వేసే సజ్జను రైతులు పూర్తి స్థాయిలో సాగు చేస్తున్నారు. సత్యవేడు, వరదయ్యపాళెం, నాగలాపురం, కేవీబీపురం మండలాల్లో సజ్జ సాగు చేపట్టారు.

సజ్జకు పెరుగుతున్న డిమాండ్

నాలుగు మండలాల పరిధిలో ప్రస్తుతం సుమారు 600 హెక్టార్లకు పైగా సజ్జ సాగులో ఉంది. సత్యవేడులో 248, పిచ్చాటూరులో 180, నాగలాపురంలో 112 హెక్టార్లు, వరదయ్యపాళెంలో 60 హెక్టార్లలో పంట సాగు చేపట్టారు. సజ్జ, రాగులు, జొన్నలకు డిమాండ్ పెరగడంతో రైతులు త్రుణ ధాన్యాల సాగుపై దృష్టి సారిస్తున్నారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నీరు తక్కువ ఉన్నా పంట పండుతుండడం కూడా ఓ కారణం.

వర్షాలతో మంచి దిగుబడి

ఈ ఏడాది రైతులు సజ్జ సాగు ప్రారంభించినప్పటి నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు పడుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులు సకాలంలో పంట సాగు చేపట్టడడంతో సజ్జ పంట రైతులు ఆశించిన విధంగా ఉంటుంది. పంట దిగుబడి దశలో రైతులు సూచనలు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చు

పంట పూర్తిగా పచ్చదనం



వరుణుడు కరుణించడంతో పంటకు నీటి సమస్య తీరుతోంది. అధికారుల సూచనలు పాటించడంతో పంట ఎన్ను దశ బాగా ఉంటుందని ఆశిస్తున్నాను. ఈసారి సజ్జ పంట లాభంగానే ఉంటుందని ఆశిస్తున్నారు.
–శ్యాంప్రసాద్‌రెడ్డి, కేఎస్‌పేట

సరైన మందులు వాడాలి



కంకికి గింజ పట్టే సమయంలో మ్యాంకోజెబ్ అనే మందును లీటరు నీటిలో 2.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. అలాగే కార్బండిజమ్ వారానికి రెండు సార్లు పిచికారీ చేస్తే తేనె బంక తెగులు ఉంటే తొలగి, గింజ సమృద్ధిగా పడుతుంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వివరాలకు వ్యవసాయ అధికారులను కలవండి.
–మురళి, వ్యవసాయ అధికారి, సత్యవేదు

అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలి

తిరుపతి కల్చరల్: జిల్లాలోని బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కళ్లిచెట్టు గ్రామం వద్ద కల్కి ట్రస్ట్ వారు ఆక్రమించిన 21 ఎకరాల అంజూర్ అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలని హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ, కల్కి ట్రస్ట్ ఆక్రమించిన అటవీ భూములను స్వాధీనం చేసుకోవడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్య వైఖరి చూపుతున్నారని ప్రశ్నించారు.